# క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- గెలుపోటములు క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలి
- ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దారా రమేష్
- క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభించిన రమేష్



**కొత్తగూడెం, మే06(కెరటం న్యూస్)**

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, క్రీడల వలన మానసిక మనోస్థైర్యం పెరుగుతుందని, యువతలో ఆత్మవిశ్వాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయని ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దారా రమేష్ అన్నారు. సోమవారం ప్రకాశం స్టేడియం గ్రౌండ్లో రెడ్డి భాస్కర్ ఆధ్వర్యంలో జరుగుతున్న కొత్తగూడెం క్రికెట్ చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. క్రీడల్లో అత్యున్నత స్థాయికి ఎదిగిన వారు ఎంతో మంది ఉన్నారన్నారు. యువత ఏ పోటీల్లో అయినా గెలుపు ఓటములు సహజమని అన్నారు. గెలిచినా వారు ఇంకా శ్రమిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించలని, ఓడిన వారు మరింత పట్టుదలతో ఆడుతూ గెలుపు దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన క్రీడగా క్రికెట్‌కు ప్రత్యేక స్థానం ఉందని, మన దేశంలో క్రికెట్‌కు మంచి ఆదరణ ఉందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడాకారులను అందరినీ సమన్వయంచేసుకుంటూ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రమేష్, క్రాంతి, గొల్లపల్లి అశోక్, అమీర్ పాల్గొన్నారు.



# అధునాతన డయాగ్నస్టిక్ సేవలే లక్ష్యం

- అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్, అపోలో వన్ ప్రారంభం
- 'అపోలో జెన్' పేరుతో హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం కూడా..
- 'నౌ ఫర్ ఫ్యూచర్' తో మళ్లీ తల్లిదండ్రులు కావాలనుకునే వారికి ఆహ్వానం
- మధురమైన లాలిపాట విడుదల



**హైదరాబాద్, మే06(కెరటం న్యూస్) :**

అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆధునిక డయాగ్నస్టిక్ సేవలందించే అపోలో వన్ ఆధ్వర్యంలో బెంగుళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో ఏర్పాటు చేసిన అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్, అపోలో వన్ హాస్పిటల్‌ను అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భారత మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ప్రకాశ్ పదుకొణే, ప్రముఖ కన్నడ నటి సప్తమి గౌడ విచ్చేశారు. జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీత, గాయకుడు రాహుల్ దేశ్‌పాండే వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగీతా రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమన్నారు. తద్వారా కీలకమైన సమయాలలో ఉత్తమ వైద్య సేవలు అందేలా చేయనున్నామని చెప్పారు. అపోలో క్రెడిల్ కు బెంగళూరులో ఇది 7వ కేంద్రం, దేశవ్యాప్తంగా 19వ కేంద్రం అన్నారు. ఇది 50 పడకలతో కూడిన హాస్పిటల్ అన్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించామని తెలిపారు. ఈ ఆధునిక కేంద్రంలో లగ్జరీ ప్రసవ సదుపాయాలు, గైనకాలజీ, ఫీటల్ మెడిసిన్, లెవెల్ ఐఐఐ ఎన్ఐసీయూ, ఈ-ఎన్ఐసీయూ, పీఐసీయూ, అధునాతన శస్త్రచికిత్సా సేవలు, మాతృ శిశు అత్యవసర చికిత్స కేంద్రం, హై-రిస్క్ గర్భధారణల కోసం 24/7 రక్త నిల్వ కేంద్రం ఉన్నాయని తెలిపారు. పిల్లల కోసం జనరల్ పీడియాట్రిక్స్‌తో పాటు శస్త్రచికిత్స, న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ వంటి సేవలు కూడా అందుబాటులో కలవన్నారు. మాతృ ఆరోగ్య సేవలతో పాటు మహిళలకు నాన్ హెల్త్ చెక్ అప్ ప్యాకేజీలు కూడా ఉన్నాయన్నారు.

అపోలో క్రెడిల్‌కు అనుబంధంగా అపోలో వన్ కూడా లగ్జరీ హెల్త్‌కేర్ సేవలు అందిస్తుందన్నారు. ఇది రోగులకు సౌలభ్యం, సౌకర్యంతో కూడిన ఆరోగ్య సంరక్షణకు హామీ ఇస్తుందన్నారు. అపోలో వన్‌లో 180 నిమిషాల సమగ్ర హెల్త్ చెక్-అప్స్, నిపుణుల సంప్రదింపులు, టీకాలు, సీటీ, ఎంఆర్ఐ, డెక్సా స్కాన్, మామోగ్రఫీ వంటి ఆధునిక డయాగ్నస్టిక్స్ సేవలు ఉన్నాయన్నారు. ఇవన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హెల్త్ స్కాన్లు ద్వారా రోగి భవిష్యత్ ఆరోగ్య ప్రమాదాలను అంచనా వేయవచ్చన్నారు. ఈ సేవలకు మద్దతుగా చెన్నైలో ఇటీవల ప్రారంభించిన అపోలో సెంట్రల్ రిఫరెన్స్ ల్యాబ్ ఉపయోగపడుతుందని తెలిపారు. దీని ద్వారా నాణ్యమైన ఆరోగ్య విశ్లేషణ అందుతుందన్నారు. అపోలో వన్లో భాగంగా ప్రారంభించిన అపోలో జెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హెల్త్ చెక్ ఆప్ ప్లాట్‌ఫాం అన్నారు. దీనిలో హెూల్ బాడీ ఎంఆర్ఐ స్కాన్, గట్ మైక్రోబైయోమ్ విశ్లేషణ, కాల్షియం స్కోరింగ్, మానసిక సామర్థ్య పరీక్షలు, భవిష్యత్తు ఆరోగ్య సూచనలు అందించే ప్రముఖ సాంకేతిక పరికరాలు ఉన్నాయన్నారు. ఆర్థోపెడిక్స్, న్యూరాలజీ, ఈఎన్టీ, దంత వైద్యం, కార్డియాలజీ, ఫల్మనాలజీ, కంటి పరీక్షలు, ఫిజియోథెరపీ వంటి విభాగాలలో సులభంగా అర్థమయ్యే హెల్త్ రిపోర్టులు అందించబడతాయని తెలిపారు. ఓపీడీలు, ఆత్మవిశ్వాసాన్ని కలిగించే అంతర్గత రూపకల్పన, అత్యాధునిక సాంకేతికత ఆరోగ్యకరమైన చికిత్స వాతావరణాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. అపోలో క్రెడిల్, అపోలో వన్ ఈ సరికొత్త కేంద్రంలో ప్రతి కుటుంబానికి సమగ్ర ఆరోగ్య సంరక్షణ అందించాలన్నదే మా లక్ష్యమన్నారు. అపోలో వన్‌లో అత్యున్నత చికిత్స అందించే 'అపోలో జెన్' కలదన్నారు. తద్వారా ఇది ఒక లగ్జరీతో కూడిన హెల్త్‌కేర్ అన్నారు.

# శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించండి..

**ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దారా రమేష్**



**కొత్తగూడెం, మే06(కెరటం న్యూస్)**

ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత, శాంతియుత సమాజానికి పాటుపడిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దారా రమేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా దారా రవేష్ మాట్లాడుతూ.. ప్రాపంచిక సుఖాలను విస్మరించిన ఆమె వైశ్యుల మనసులలో ఒక విజేతగా, శాంతికి చిహ్నంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఎప్పటికి నిలిచిపోతుందని, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ, యువజన సంఘం, మహిళా విభాగ్ మండల, పట్టణ అధ్యక్షులకు, కార్యదర్శులు బుధవారం పట్టణాలలో, మండలాలలో, గ్రామాలలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను రాష్ట్ర కమిటీకి పంపడం జరుగుతుందని, పత్రికలలో సైతం ప్రచురించేలా చూడాలని తెలిపారు.



# అక్రమ వలసదారులను వెంటనే పంపించాలి

- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెర్వు శ్రీనివాసరావు
- బిజెపి ఆధ్వర్యంలో పాల్వంచ తాసిల్దార్‌కు వినతి పత్రం అందచేత

**కొత్తగూడెం, మే06(కెరటం న్యూస్)**

పాకిస్తాన్, మయన్మార్, బంగ్లాదేశ్ నుండి మన దేశానికి అక్రమంగా వలస వచ్చి పాల్వంచ పట్టణ, మండల పరిధిలో నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించి, వెనక్కి పంపేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెర్వు శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు పాల్వంచ పట్టణ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు పాల్వంచ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం చింతలచెరువు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. గత నెలలో జమ్మూ కాశ్మీర్ పహల్గాం ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో 28 మంది అమాయక పౌరులను పాకిస్తాన్ ఉగ్రవాదులు పొట్టనపెట్టుకున్నారని, ఈ క్రూరమైనా దాడిని ఖండిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు అన్ని మండల హెడ్ క్వాటర్స్‌లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ చర్యలకు వ్యతిరేకంగా ప్రపంచంలోని అనేక దేశాలు భారత్‌కు అండగా నిలుస్తున్నాయని, ప్రధాని నరేంద్ర మోడీ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంకల్పించారని, ఈ నేపథ్యంలో భారత రక్షణ దళాలకు పూర్తి స్వేచ్ఛని యడం శుభ పరిణామమని పేర్కొన్నారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా అక్రమంగా నివసిస్తున్న ఎటువంటి పత్రాలు లేకుండా, గడువు ముగిసిన వీసాలు కలిగి ఉన్న, లేదా వీసాలు సస్పెండ్ చేయబడిన అక్రమ వలస దారులందర్నీ గుర్తించి అధికారులు వెంటనే దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు రాపాక రమేష్, పోలోజు క్రాంతికుమార్, భూక్యా రవినాయక్, కటికల రంజిత్, బీమాల్ జైన్, కనుకుంట్ల వెంకటరెడ్డి, తాటికొండ కళ్యాణ్,మహేష్ వీరన్న, బాలు తదితరులు పాల్గొన్నారు.

